
సాక్షి ప్రకాశం

ఆదివారం | 30 | జూలై | 2023



గుండ్లకమ్మ గలగల

గుండ్లకమ్మ వాగు పరవళ్లు తొక్కుతోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

- 8లో..



కర్ర ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

బైకుపై వెళ్తున్న తల్లీకొడుకులను కర్ర ట్రాక్టర్ ఢీకొనడంతో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ మార్కాపురం రాక

మార్కాపురం టౌన్: ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆదివారం ఉదయం 11 గంటలకు మార్కాపురం వస్తున్నట్లు డీపీఆర్‌ఓ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కడపకు బయలుదేరి వెళతారు.

ఆటో డ్రైవర్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు



జీజీహెచ్ ప్రాంగణంలో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

ఒంగోలు అర్బన్: సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా పార్కింగ్ చేసినా ట్రాఫిక్‌కు అడ్డుగా ఆటోలను నిలిపినా చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో జీజీహెచ్‌లో ట్రాఫిక్ సమస్యలను శనివారం ట్రాఫిక్ డీఎస్పీ, ఆసుపత్రి ఆర్ఎంఓ చైతన్యవర్మ పరిశీలించారు. జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందిపై ఆటో డ్రైవర్‌లు దాడి చేస్తున్నారని అటువంటి ఘటనలు పునరావృతం అయితే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్దేశించిన ప్రాంతంలోనే వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ఆర్ఎంఓ చైతన్యవర్మ మాట్లాడుతూ రోగులు ఆస్పత్రిలోనికి వెళ్లేందుకు ఎటువంటి ఆటకం లేకుండా చూడాలన్నారు. ఇన్ పేషెంట్‌లుగా ఉన్న రోగులకు, వారి అటెండెంట్లకు కూడా భద్రత పరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ మాధురి పాల్గొని సమస్యలను డీఎస్పీకి వివరించారు.

నయనం.. నవతేజం



చూపులేకపోతే బతుకంతా చీకటే..చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమే. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రాధాన్యతాంశాల్లో కంటిచూపు పరిరక్షణకు చోటిచ్చారు. 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం ద్వారా చిన్నారుల నుంచి పండుటాకుల వరకూ అందరిలో దృష్టి లోపాలు సవరించి అవసరమైన శస్త్రచికిత్సలు ఉచితంగా చేయిస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. జిల్లాలో రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసి మూడో దశను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.

- జిల్లాలో పక్కా 'కంటి వెలుగు'
- ఆరు దశల్లో అమలుకు పక్కా ప్రణాళికలు
- విజయవంతంగా తొలి రెండు దశలు పూర్తి
- జిల్లాలో మొత్తం 4,29,464 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు
- మూడో దశలో 2,68,072 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం
- ఇప్పటి వరకూ 1,85,276 మందికి కంటి పరీక్షలు
- అందులో 46,256 మందికి కంటి అద్దాలు పంపిణీ

ఒంగోలు అర్బన్:

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. అన్నీ ఇంద్రియాలలోకెల్లా నేత్రాలు ఎంతో ముఖ్యమైనవి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎవరికీ కంటి చూపు దూరం కాకూడదనే సంకల్పంతో చేపట్టిన 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం జిల్లాలో లక్షలాది మందికి కంటిచూపు ప్రసాదిస్తోంది. ఆరు దశల్లో అమలు చేసే ఈ కార్యక్రమం ప్రస్తుతం మూడో దశలో ఉంది. మొదటి రెండు దశల్లో అన్నీ ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య చికిత్సలు, కంటి అద్దాలు అందజేశారు. మూడు నుంచి ఆరో దశ వరకు నాలుగు దశల్లో వృద్ధులతో పాటు అవసరమైన ప్రజలందరికీ ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాలు అందజేయడం, శస్త్ర చికిత్సలు చేస్తారు.

4,29,464 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తొలి రెండు దశల్లో 4,29,464 మంది విద్యార్థులకు కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 33,761 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉందని ప్రాథమికంగా గుర్తించారు. రెండో దశలో 33,761 మందికి తిరిగి పరీక్షలు నిర్వహించి 12,530 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 4,627 మంది విద్యార్థులకు ఉన్నత స్థాయి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 341 మందికి కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు.

మూడో దశలో జిల్లా వ్యాప్తంగా 60 ఏళ్లు పైబడిన 2,68,072 మందికి వైద్యసేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 16 వైద్య బృందాలు 1,85,276 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 46,256 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేయగా 4 వేల మందికి పైగా శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేశారు.



కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆశయాల మేరకు ప్రజలకు వైద్య సేవలు



రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అనేక పథకాలు చేపట్టి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అంధత్వ నివారణ కార్యక్రమాలు చేపట్టి మొదటి రెండు దశల్లో పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. ప్రస్తుతం మూడో దశను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– దినేష్‌కుమార్, కలెక్టర్

నిరంతరాయంగా కంటి వెలుగు కార్యక్రమం



కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశాం. అవసరమైన విద్యార్థులకు ఆపరేషన్‌లు నిర్వహించాం. మూడో దశలో ఇప్పటికే 70 శాతం పైగా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశాం. అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్‌లు ఉచితంగా చేశాం. లక్ష్యాలను సాధిస్తున్నాం.

– డాక్టర్ నళిని, జిల్లా ప్రోగ్రాం మేనేజర్

కార్పొరేట్ హాస్పిటల్ కంటే మిన్నగా పీహెచ్‌సీ



కొత్తపట్నం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎన్‌క్యూఏఎస్ బృందం

- ఎన్‌క్యూఏఎస్ బృందం వెల్లడి

కొత్తపట్నం: కార్పొరేట్ హాస్పిటల్ కంటే మిన్నగా కొత్తపట్నం పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించడం అభినందనీయమని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎన్‌క్యూఏఎస్ బృంద సభ్యులైన చెన్నై, కోల్‌కతా నుంచి వచ్చిన వైద్యులు ప్రియావసంతకుమారి, సోమజిత్ చక్రవర్తి.. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీల శాతం రోజురోజుకు పెరిగినట్లు గమనించారు. డెలివరీలు, మందులు వంటి సుమారు 95కుపైగా పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న వసతులు, మరుగుదొడ్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐపీ విభాగం, డెలివరీ విభాగం, రక్తపరీక్షల ల్యాబ్, మందుల విభాగం, పరిపాలనా విభాగాలను తనిఖీ చేశారు. రోగులకు కావాల్సిన మందుల గురించి తెలుసుకుని అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. ఇన్‌పేషెంట్ల రూములు, బెడ్లు, వాతావరణం, గాలి, వెలుతురు వంటి వాటిని పరిశీలించారు. ఫీల్డ్‌కు సంబంధించిన రికార్డులు కూడా తనిఖీ చేసి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి సూపర్‌వైజర్లకు వివరించారు. పీహెచ్‌సీని నాడు–నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షల నిధులతో ఆధునికీకరించి కార్పొరేట్ హాస్పిటల్ కంటే మిన్నగా సేవలు అందించడంపై ఎన్‌క్యూఏఎస్ బృంద సభ్యులు అభినందించారు. ఆస్పత్రిలో అన్నీ సక్రమంగా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. హాస్పిటల్ సిబ్బంది క్రమశిక్షణ తమకు ఎంతో నచ్చిందన్నారు. ఇదే విధంగా వైద్య సేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో మొక్కలు నాటారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వైష్ణవి, డాక్టర్ పి.హేమంత్‌కుమార్, యూడీసీ కె.శరత్ కుమార్, సీహెచ్‌వో ఓంకార్, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వోలు), స్టాఫ్ నర్సులు ప్రశాంతి కుమారి, ప్రమీల, విజయభారతి, ఫార్మసిస్ట్ ఆదిలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక 47, 48, 49, 50 డివిజన్లలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే సదుద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారన్నారు. ప్రజలు 11 రకాల పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో వాటన్నింటినీ నిర్ణీత సమయంలో పంపిణీ చేయడం ద్వారా వారికి ఆర్థికంగా కూడా ఉపయోగకరంగా ఉంటుందని భావించారన్నారు. ఆ క్రమంలోనే వలంటీర్ నేరుగా ప్రజల ముంగిటకు వచ్చి సేవలు అందించడం నిజంగా హర్షించాల్సిన అంశం అని పేర్కొంటూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఒక శాటిలైట్ టౌన్‌షిప్‌ను రూపొందించాలని తాము భావించామని అందులో భాగంగా యరజర్ల కొండ వద్ద పాతిక వేలమందికి పట్టాలు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేస్తే దానిని టీడీపీ రాజకీయ దురుద్దేశంతో వారి నాయకులచేత కోర్టులో కేసు వేసి అడ్డుకుందన్నారు. ఈ క్రమంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.200 కోట్లు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేశామని, వచ్చే నెలలోనే సీఎం చేతుల మీదుగా పాతిక వేలమందికి పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. అదే విధంగా డెయిరీని పునరుద్ధరించడం, రూ.339 కోట్లతో నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే పనులకు సీఎం ఆగస్టులో శంకుస్థాపన చేస్తారన్నారు. వలంటీర్లు స్వార్థ రహితంగా, సామాజిక సంక్షేమాన్ని కాంక్షిస్తూ పనిచేస్తున్నారని ప్రశంసించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎన్నికల వేళ ఓట్ల కోసం తాయిలాలు ఇచ్చే పార్టీలను గతంలో చూశారని , కానీ మన జగనన్న మాత్రం గెలిచిన మొదటి రోజు నుంచి పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే పనిచేశారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకునేందుకు వాసన్న అండగా ఉన్నాడని, వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ మురళి, కార్పొరేటర్లు వేమూరి భవాని మాల్యాద్రి, అంగిరేకుల గురవయ్య, అంబటి ప్రసాదరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, గంటా రామానాయుడు, నెరుసుల రాము, వివిధ డివిజన్ల అధ్యక్షులు దావలి శ్రీనివాసరావు, పసుపులేటి వీరభద్రరావు, ఉన్నం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మంతనాలతో సరి

మద్దిపాడు: వచ్చాము..వెళ్లాము.. అన్నట్లుగా మండలంలో నారా లోకేష్ పాదయాత్ర సాగింది. శుక్రవారం రాత్రి 11.30ల సమయంలో గుండ్లాపల్లి వద్ద దామచర్లకు చెందిన మహీ ఆగ్రోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో లోకేష్ బస చేశారు. శనివారం మధ్యాహ్నం తరువాత సంతనూతలపాడుకు చెందిన ముఖ్య నాయకులు కొందరిని కలిసి ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధానంపై మాట్లాడినట్టు సమాచారం. అయితే నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఉన్న నాయకులతో కాకుండా కొద్ది మందితో సరిపెట్టడంపై స్థానిక నాయకుల్లో నిరాశ నెలకొంది. సాయంత్రం 4.30 గంటల తరువాత రోడ్డెక్కిన లోకేష్ గ్రోత్‌సెంటర్ వరకూ పాదయాత్ర చేశారు. ఆ తర్వాత అద్దంకి నాయకులు ఆయనను ఆహ్వానించారు.



గుండ్లాపల్లి నుంచి పాదయాత్ర చేస్తూ బాపట్ల జిల్లాలోకి ప్రవేశిస్తున్న నారా లోకేష్

రాష్ట్రంలో గెంతుతున్న పచ్చ కప్పలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వర్షాకాలంలో చెరువులకు నీరు చేరినప్పుడు ఎక్కడెక్కడి కప్పలన్నీ ఆ చెరువులో చేరినట్లు ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంలో పచ్చ కప్పలు గెంతుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పెద్దదోర్నాల మండలంలోని కటకానిపల్లెలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఏమేమో చేస్తామని అలివికానీ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించడం ఆనవాయితీగా పెట్టుకున్నాడని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ, దాని తోకపార్టీ అయిన జనసేనను అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో కలయ తిరుగుతున్నారని వ్యగ్యంగా అన్నారు. చంద్రబాబు తనయుడు లోకేష్ పాదయాత్ర పేరుతో ఊరూరా తిరుగుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, అబ్బ కొడుకులకు అధికార దాహం పట్టిందని విమర్శించారు. ప్రకాశం జిల్లా గురించి ఎటువంటి అవగాహన లేని లోకేష్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏమి పీకారని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జిల్లాను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని ఆయనకు తెలియనట్లుందని, రామాయపట్నం పోర్టు, దొనకొండ కారిడార్, విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం లాంటి అంశాలు ఏమీ నెరవేర్చని పరిస్థితులను ఆయన తెలుసుకోలేకపోయాడని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రామాయపట్నం పోర్టు ఏర్పాటుచేసి టెండర్లు పిలిచి శరవేగంగా పనులు జరుగుతున్నాయని, వెనకబడిన పశ్చిమ ప్రాంతంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెలిగొండ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. వేల మందికి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించడం అభివృద్ధి కాదా.. ఇవి లోకేష్‌కు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఒంగోలు పట్టణంలో రిమ్స్ కళాశాల, శాశ్వత నీటి పరిష్కారానికి శ్రీకారం చుట్టడం, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసినవారు ఎవరైనా ఉన్నారంటే బాలినేని శ్రీనివాసరెడ్డి, అటువంటి వ్యక్తిని విమర్శించడం సరైనది కాదని అన్నారు. ముందుగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు గుమ్మా పద్మజ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.మజీద్, జెడ్పీటీసీలు దూమావత్ లతాబాయి, చేదూరి విజయభాస్కర్, వై.చలమారెడ్డి, ఎం.జాన్ పాల్, మాజీ జెడ్పీటీసీ అమిరెడ్డి రామిరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు గంటా రమణారెడ్డి, కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్.పిచ్చయ్య, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ డి.కాశింపీరా, సర్పంచ్ పిక్కిలి కోటిలింగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని రమణాలవారిపాలెం గ్రామంలో కైపు రాజశేఖరరెడ్డి అనే యువకుడు అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు. రమణాలవారిపాలెం గ్రామానికి చెందిన ఎల్.బ్రహ్మారెడ్డి బంధువు అయిన రాజశేఖరరెడ్డిది నరసరావుపేట జిల్లా క్రోసూరు మండలం దొండ్లేరు గ్రామం. అతని తల్లి పద్మ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పద్మని చూసేందుకు వెళ్లిన బ్రహ్మారెడ్డి.. మతిస్థిమితం లేకుండా అక్కడ ఇబ్బంది పడుతున్న రాజశేఖరరెడ్డిని ఈ నెల 16న రమణాలవారిపాలెం తీసుకొచ్చాడు. రెండు రోజులు బాగానే ఉన్న రాజశేఖరరెడ్డి.. ఈ నెల 19వ తేదీ బహిర్భూమికని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వెతికినా కనిపించకపోవడంతో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు. గతంలోనూ రెండు సార్లు రాజశేఖరరెడ్డి ఇళ్లు వదిలి వెళ్లిపోయినట్లు తెలిసింది.

పాత పెన్షన్ కోసం 30న ఢిల్లీలో ర్యాలీ

ఒంగోలు: పాత పెన్షన్ సాధన కోసం ఆలిండియా కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి జూలై 30న పార్లమెంట్ ఫర్ ధ్యానాకర్షణ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కేవీజీ కీర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానం రద్దు, శాశ్వత జాతీయ పే కమిషన్ అమలు తదితర డిమాండ్ల సాధనకై ఆలిండియా పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, అఖిల భారత విద్యార్థి సంఘాల సమాఖ్య, ఏపీ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్‌తో పాటు పలు సంఘాలు కలిసి పార్లమెంట్ ఫర్ ధ్యానాకర్షణ్ ర్యాలీ నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రాతినిధ్యం వహించాలని కోరారు.



రంగనాయకస్వామి దేవస్థానం వద్ద గుండంలోకి జారుతున్న గుండ్లకమ్మ జలపాతం



రంగనాయకస్వామి ఆలయ ముఖద్వారం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు





నల్లమలలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు

గుండ్లకమ్మ గల గల

గుండ్లకమ్మ వాగు పరవళ్లు తొక్కుతోంది. నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శనివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనాన్ని మూడు గంటల పాటు నిలిపివేశారు. ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాలాజీనాయక్, అటవీ శాఖాధికారులు బందోబస్తు నిర్వహించి భక్తులు వెళ్లకుండా ఆపివేశారు. గుండ్లకమ్మ గలగలతో చెరువులన్నీ నిండి వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని రాచర్ల, కంభం, తదితర మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - రాచర్ల

మెరుగైన వైద్యం అందించాలి

- ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తాం
- మాతాశిశు వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: స్థానిక మాతా శిశు వైద్యశాల (ఎంసీహెచ్)లో గర్భిణులు, పసిపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి డాక్టర్లకు సూచించారు. శనివారం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆస్పత్రిని పరిశీలించి అవసరమైన ఆర్వో ప్లాంటు, ఏసీలు, జనరేటర్‌కు మరమ్మతులు తదితర సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నిధులు కేటాయించి ఆస్పత్రి అభివృద్ధికి తోడ్పడతానని చెప్పారు. కొత్తగా నిర్మించిన భవనంలో కూడా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజలకు అందించే వైద్య సేవల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని, ఆ మేరకు ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, శిశువులు పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ మూర్తి, ఆస్పత్రి కన్వీనర్ డాక్టర్ వెంకట్రావు, సభ్యులు విజయలక్ష్మి, సాయి, విజయభాస్కర్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

కర్ర ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

- కొడుకుకు తీవ్రగాయాలు



స్పాట్‌లోనే మృతిచెందిన మస్తాన్‌బీ



తీవ్ర గాయాలపాలైన మున్నా

చీమకుర్తి: బైకుపై వెళ్తున్న అమ్మాకొడుకులను కర్ర ట్రాక్టర్ ఢీకొనడటంతో తల్లి షేక్ మస్తాన్‌బీ (45) అక్కడికక్కడే మృతి చెందింది. కొడుకు మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. చీమకుర్తి మండలం పాటిమీదపాలెం-గంగవరం మధ్య కంకర మిల్లుల వద్ద శనివారం ఈ ప్రమాదం జరిగింది. కర్ర ట్రాక్టర్ గంగవరం నుంచి చీమకుర్తి వైపు వస్తుంది. అదే సమయంలో చీమకుర్తి నుంచి గంగవరం వైపు బైకుపై మస్తాన్‌బీ, మున్నా వెళ్తున్నారు. ట్రాక్టర్‌లో నుంచి బయటకు వచ్చిన కర్ర తగలడంతో బైకుపై వెళ్తున్న అమ్మాకొడుకు కిందపడిపోయారు. తల్లి మస్తాన్‌బీకి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, కొడుకు మున్నా తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. చీమకుర్తి ఎస్సై రామిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మున్నాను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా మహిళా క్రికెట్ జట్టు విజయం



ప్రకాశం జిల్లా మహిళల క్రికెట్ జట్టు

ఒంగోలు: గుంటూరు జిల్లా పేరేచర్లలో జరుగుతున్న అంతర్ జిల్లాల సీనియర్స్ మహిళా క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు విజయభేరి మోగించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ప్రకాశం జట్టు బౌలర్ వి.సేతు సాయి 10 ఓవర్లలో 34 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు తీసి రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 49.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ప్రకాశం జట్టులో టి.మల్లిక 63 పరుగులు చేయగా, సేతు సాయి 37 పరుగులతో రాణించి ప్రకాశం జట్టుకు విజయాన్ని అందించారు.

జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటించాలి

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పీడీ శీనారెడ్డి




మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీడీ శీనారెడ్డి, ఏపీడీ, సిబ్బంది

మద్దిపాడు: హరిత ప్రకాశం కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటించాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పీడీ శీనారెడ్డి సూచించారు. మద్దిపాడు మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్ నుంచి గురవారెడ్డిపాలెం వరకూ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఉదయం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 108 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరుపైపులా మొక్కలు నాటించడానికి అనుమతులు వచ్చాయన్నారు. పది రోజుల వ్యవధిలో లక్ష మొక్కల వరకూ నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సీతారాంపురం కొష్టాల సెంటర్ నుంచి గురవారెడ్డిపాలెం వరకూ 800 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ప్లాంటేషన్ మేనేజర్ విజయలక్ష్మి, సంతనూతలపాడు, మద్దిపాడు ఏపీవోలు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సబ్ జూనియర్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు: సబ్ జూనియర్ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఆదివారం మార్కాపురం ఎస్‌వీకేపీ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.విన్సెంట్, అంచిపోగు రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, ప్రతిభా చూపిన వారితో జిల్లా తుది జట్లను ఎంపిక చేస్తామని చెప్పారు. క్రీడాకారులు 2010-11 మధ్యలో జన్మించి ఉండాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఆధార్, వయసు ధ్రువీకరణతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 9849760566, 9030815900ను సంప్రదించాలని కోరారు.

వ్యభిచార గృహానికి తాళం వేసిన మహిళలు



వ్యభిచార గృహానికి తాళం వేస్తున్న మహిళలు

సింగరాయకొండ: వ్యభిచార గృహానికి మహిళలు తాళం వేసిన సంఘటన సింగరాయకొండలోని బాలయోగినగర్‌లో శనివారం జరిగింది. ఒక మహిళ కొన్ని రోజులుగా స్థానిక నివాస గృహాల మధ్య తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తోంది. వ్యభిచారం చేస్తున్న మహిళను స్థానికులు ఎన్ని సార్లు హెచ్చరించినా తీరు మారలేదు. దీంతో ఆగ్రహించిన మహిళలు.. వార్డు మెంబర్ గుంజి సుబ్బారావు ఆధ్వర్యంలో వ్యభిచార గృహానికి తాళం వేశారు. ఆ సమయంలో ఆ ఇంట్లో ఇద్దరు యువకులు, ఒక మహిళ ఉన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శ్రీరామ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఇద్దరు యువకులు షేక్ జిలాని, శివతో పాటు మహిళను అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఆ ఇంటి యజమానురాలిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.